నీలకంఠం

ఊర్వశి

ఊరుచివర పడిపోతున్న ఒక్కొక్క మేడిల్లు, విరిగిపడే సముద్రపుటలలు బాధలతో కృంగి గాజు కళ్లలో ప్రాణాల నిలుపుకునే ముసలివాళ్లు, కనిపించినపుడు నాలో ఏదో అనిర్వచనీయమైన బాధ కలుగుతుంది. నీలకంఠాన్ని చూచినప్పుడైనా అంతే!

ఒక్కొక్కప్పుడు కొందర్నిచూస్తే ఆత్మీయత, కొందర్నిచూస్తే ద్వేషం కలిగినట్లే నాకు నీలకంఠాన్ని చూచినపుడు సానుభూతి కలుగుతుంది. అపుడా సానుభూతికి అర్థంలేదు. అపుడాతన్నిచూచి సానుభూతిని చూపే అవసరంకూడా లేదు. కాని అతన్ని చూస్తే ఎందుకో జాలి కలిగేది. మనసులో దిగులుగా ఉండేది. ఏదో చెయ్యాలనిపించేది. నీలకంఠం నాకు గుర్తున్నంతవరకూ నవ్వలే. దాని అర్థం విచారంగా ఉండేవాడని కాదు. నాకన్నా పదిహేను సంవత్సరాలు పెద్దవాడైన నీలకంఠాన్ని చూస్తే మాత్రం ఎందుకో 'అయ్యో?' అనిపించేది ఏ క్షణంలో అతన్ని చూచినపుడు నాకాతని మీద ఆ భావం కలిగిందోగాని, అదే భావం నాలో జీవితాంతం ఉండిపోతుందని నేననుకోలేదు.

నీలకంఠం నాకు బాగ గుర్తు. అతనిది కూడ మావూరే. నీలకంఠాన్ని 'నీలయ్య' అనిపిలిచేవారు మా ఊళ్లో. నీలయ్య నాకు మిత్రుడిలాంటి వాడు. మామధ్య పదిహేను సంవత్సరాల తేడాఉన్నా మామధ్య మిత్రత్వం ఏర్పడటానికి కారణం నీలయ్య చేతిలోనున్న బొమ్మల చెక్కే నేర్పరితనమే. నీలయ్య చక్కని కర్రబొమ్మల చెక్కేవాడు. ఆతని చేతిలో ఆడవాళ్ల బొమ్మలు చాల చక్కగా తయారయ్యేవి. ఆ బొమ్మలు నన్ను ఆకర్షించేవి. ఉద్రేకపరచేవి. అప్పుడు నాకు పదేళ్ల వయసు. ఆ వయసులో నేను నీలయ్యను అనుసరించ ప్రయత్నించటం చూచి నీలయ్య నాకు మట్టిబొమ్మలు చేయటం నేర్పాడు. నేను బొమ్మలనెంత బాగా చేయలేకపోయినా, చాల బాగున్నాయని మెచ్చుకుని, పరిచేసి అందరికీ బొమ్మల చూపి పొగిడేవాడు నన్ను. అందుచేతనే కాబోలు నీలయ్యపై నాకు చాలా అభిమానముండేది.

మా ఊరిచివర తోటదగ్గరి ఇల్లే నీలయ్యది. చిన్నప్పుడు ఎవరూలేనివాడైనాడు నీలయ్య. చిన్నప్పటినుండి అందరితో మంచిగా ఉండేవాడు. ఎవరితోనూ కయ్యానికి పోయేవాడు కాదు. రోజుకు మూడుసార్లు 'టీ' త్రాగటంతప్ప మరే దుర్వ్యసనం ఉండేది కాదు. అందంగా ఆరోగ్యంగా ఉండేవాడు. మావూరిలోజరిగే గౌరీపున్నమి ఉత్సవాలలో వేషాలువేసి యువకుల ఉత్సాహ పరిచేవాడు. కలా కపటం లేని నీలయ్యను మా వూరంతా ప్రేమించింది.

నీలయ్య వారింటిముందు పశువులశాల లాంటి పాక, ఆ పాకముందు వేపచెట్టు, ఆ వేపచెట్టుకు ఒక ఉయ్యాల ఉండేది. సెలవురోజుల్లో మా పిల్లలమందరం అక్కడే ఆడుకునేవారం. మేమెంత అల్లరి చేసినా ఏమనేవాడు కాదు. ఇంటివెనుక పెద్దనుయ్యి నూతిప్రక్కన సపోటాచెట్లు, మామిడిచెట్లు ఉండేవి. ఇంటిముందువున్న పాకలో కర్రపని చేసేవాడు నీలయ్య. మాకు అందరికీ సపోటాలు కోసియిచ్చేవాడు. ఊళ్లో అమ్మించే సపోటాలను మాకు యిచ్చేస్తున్నాడే మరి యింకేమి అమ్మిస్తాడని నాకు జాలివేసేది. ఒకసారి నా జేబులోనున్న అర్ధణాతీసి అతనికిస్తే నవ్వుతూ అర్ధణాను జేబులోవేసి నన్ను ముద్దుపెట్టుకున్న దృశ్యం నాకు బాగ గుర్తు. నా పదేళ్ల వయసప్పుడు నీలయ్యపెళ్లి చేసికుని నాగన్న అపస్వరాలతో పాడే సన్నాయి పాటలమధ్య కొండడు, తవుడులు డప్పులు వాయిస్తూంటే పెట్రొమాక్సు దీపాలమధ్య పల్లకిలో ఊరేగటం నాకింకా గుర్తే! నీలయ్య బొమ్మలు చెక్కుతూంటే ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయిన క్షణాలు నాకు బాగ గుర్తు. ఒకసారి నీలయ్య చాల రాత్రివరకు దీపంబుడ్డి దగ్గర కళ్లలో కళ్లు పెట్టుకుని బొమ్మలు చెక్కుతూంటే చూస్తూ గోనెంకంమీద అలా నిద్రపోయాను. ఎప్పుడు నిద్రపోయానో తెలియదుగాని మర్నాటి ఉదయం మంచంమీదనుండి లేస్తూ యింటిలోకి ఎలా వచ్చానా అని ఆశ్చర్యపోతూంటే మా అమ్మే చెప్పింది, నీలయ్యే నన్ను అంత క్రితం రాత్రి ఎత్తుకొచ్చాడని.

'పెళ్లయినవాడు త్వరగా నిద్రపోవాలని

సలహా నివ్వలేకపోయానా నీలయ్యకి ?' అని మా నాన్నగారంటే 'అంతకన్నా పెద్ద సలహాలే యిచ్చాను' అంది మా అమ్మ. మా అమ్మ యిచ్చిన సలహాలుమాత్రం నాకు తెలియవు.

నీలయ్య పెళ్ళాం సీత నాతో నవ్వుతూ మాటాడేది. మంచి మంచి కథలు చెప్పేది అప్పుడప్పుడు సపోటాలు కోసి యిచ్చేది. సీత తెల్లగా అందంగా నవ్వేది. సీత నవ్వుతూంటే బుగ్గలు సొట్టలు పడేవి. అప్పుడు సీత చాల బాగుండేది. నీలయ్య బొమ్మల్ని చూసే నాకు సీతనుచూస్తే సిగ్గేసేది. సీత నన్ను దరికి తీసికుని ముద్దాడితే సిగ్గుతో కుంచుకు పోయేవాడిని. నీలయ్య బొమ్మలు చెయ్యక కర్ర పనిచేసే రోజున నేను నీలయ్యతో పాకలో ఉండేవాడిని కాదు. అలాంటి రోజుల్లో సీత చెప్పే కథల విన టానికి నేనే దొరికేవాడిని. సీత కల్పించి ఎన్నోకథలు చెప్పగలిగేది. రాజకుమార్తెను రాజకుమారుడు అర్ధరాత్రి గుర్రంమీద తీసి కెళ్ళిపోయిన కథలనెన్నో చెప్పింది సీత నాకు. ఉదయం పాకలోకివెళ్తే మళ్ళా రాత్రి ఎన్ని గంటలకు ఇంట్లోకి వచ్చేవాడో అతనికి తెలియదు. ఇంట్లోంచి ఏ వస్తువు కావలసి వచ్చినా నేనే సీతనడిగి తెచ్చేవాడిని.

సీత ఒక విధంగా పట్నవాసపు పిల్ల అవటంచేత, నగలన్నా, బట్టలన్నా, సింగా రించుకోవటమన్నా మోజు పడేది. నీలయ్య భార్య సరదాల తీర్చ ప్రయత్నించేవాడు. బండి కట్టించి ఊరికి నాలుగుమైళ్ల దూరంలోనున్న టూరింగ్ సినీమాహాలుకు సినీమా చూపించటానికి సీతను తీసికెళ్లే వాడు; తనకంత సరదాలేకపోయినా వారా నికి ఒక సినీమా అయినా చూస్తేగాని ఉండ లేని సీతను సినీమాలకు తీసికెళ్ళటం బాధగా ఉండేది నీలయ్యకు. సీతకు సిని మాలపైనున్న మోజు ఆపలేనిదని తెలిసి మావూరి ఆడవాళ్ళు సినీమాల కెళ్తూంటే వారితో పంపేవాడు. నడిచివెళ్ళి సినీమా చూచి నడిచివచ్చే భార్యనుచూచి జాలిపడే వాడు నీలయ్య. సీత సినీమాపాటల విన్నవి విన్నట్టుగా పాడేది. సినీమాబండి వీధిలోకి వస్తే చిన్నపిల్లలాగ వీధిలోకి పరుగెత్తి పోయేది. సినీమాలోవాళ్ళు అలంకరించు కునేటట్టు అలంకరించుకునేది సీత. సీతకున్న సినీమాపిచ్చిని చూచి విసుగుకునే వాడు నీలయ్య. సినీమాపిచ్చి మాన్పడం కోసం డబ్బులు యివ్వడం మానేశాడు నీలయ్య. అయినా సీత సినీమాలకెళ్లేది. ఎక్కడివి డబ్బులు అని అడిగితే తాను అప్పుడప్పుడు దాచుకున్నడబ్బులు అనేది సీత. ఒకటి రెండుసార్లు సీత నాతో అంది 'నేను సినీమాలో చేరతాను తెల్సా!' అని. తెరమీద బొమ్మలు ఎలా ఆడతాయో తెలియని నేను సీత తెరమీదకు ఎలా చేరు తుందో తెలిసికోలేక పోయాను. అప్పటికి ఒక కూతురు కొడుకు ఉండేవారు నీలయ్యకు. వాళ్ళను సరిగా చూచేది కాదు సీత. నీలయ్యే వాళ్లకు కావలసినవి చూచి పాకలో తనతో ఉంచుకునేవాడు. ఆ విష యంలో సీతమీద కోపం వచ్చేది. ఒకసారి నిజంగా కోపం వచ్చింది సీతమీద నాకు. నన్నుచూచి నవ్వేసీత ఆరోజు నేను వార్నీసు డబ్బాకోసం ఇంటిలోకి వెళ్ళబోతూంటే గబగబా గది ఇవతలికి వచ్చేసి నన్ను అవ తల నిలబెట్టి విసుక్కుంటూ వార్నీషు డబ్బా నిచ్చేసి పంపేసింది. నాకు చాల బాధ వేసిందానాడు. నేనేం తప్పుచేశానని అలా చేసిందో అర్థంకాలేదు నాకు. నేను మౌనంగా ఉండటం చూచి 'నిన్నెవరైనా అన్నారా? తంతానులే!' అని నీలయ్య అన్నాడు. రెండుమూడు రోజులు నేను నీలయ్య పాకవైపు వెళ్ళలేదసలు. మూడవ రోజున నీలయ్య పాకవైపు వెళ్ళిన నేను నీలయ్యచేతిలో కర్రనుచూచి కంగారు పడ్డాను. నే వెళ్లేసరికి నీలయ్య కోపంతో మండిపోతున్నాడు. నీలయ్య ముందు సీత జుట్టు విరబోసికుని ఏడుస్తోంది. మధ్య మధ్య కోపంగా సమాధానాలనిస్తోంది. నాకు పరిస్థితి అర్థం కాలేదు. నీలయ్య అవే మాటలు బాగ గుర్తుండి ఉంటే అసలు సంగతిని బాగా చెప్పగలిగేవాడిని.

నీలయ్యమాత్రం 'నీకేం తక్కువ చేసా

ఓం నమః శివాయ

కం॥ ఉమేశాభక్తితో గొల్చితి
ఉత్తేజ ఉత్కంఠ ఉదారనుత్తమమరాశివ్
ఉర్విలో వున్నావని,
ఉద్దండ దండప్రచండ, ప్రతిభ హ్రాశించుచుంటిన్॥

కం॥ ఊగెద నుయ్యాలలోన
ఊహించే చతురచామంతి చైతన్యసుగాను
ఊరటే ఉపాయము
ఊర్జిత పాపనాశనా నిన్నే ప్రణతింతున్॥

కం॥ ఋణగ్రస్తను కాలకంఠా
ఋణానుబంధ విలోకింప నాతరమా
ఋణమో తృణమో తెల్పు,
ఋణగుణగ్రహణ గ్రహితజ్ఞాన గౌరీశంకరా॥

కం॥ ఋూపములేని లింగన్నవు
ఋూపునిర్ధారణ నిరూపింప నసమర్థన్
ఋూపుమాపుదు రేల
ఋూపుచూపుతేల నిరాకార నిరంజనా॥

రచయిత్రి: శ్రీమతి సరస్వతీగిరి

నీలకంఠం

నాకే అన్యాయం తలపెట్టాడోనని అనటం మాత్రం నాకుగుర్తే! ఆరోజంతా చిరాకుగా ఉన్నాడు నీలయ్య. బొమ్మలేవీ చెక్కలేదు. సాయంత్రం నే వెళ్ళేసరికి నీలయ్య పాకలో లేడు. ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. నెమ్మదిగా ఇంటిలోకి వెళ్ళాను. లోపలికెళ్ళిన నాకు మామిడి చెట్టుక్రింద సీత కనుపించింది; బడ్డీకొట్టు వీరడి చేతుల్లో ఒంటిమీద బట్టలు సరిగా లేక. ఆవిధంగా కనిపించిన సీతను చూడగానే అసహ్యం కలిగింది. నీలయ్యమీద చెప్పలేని సానుభూతి ఏర్పడింది. చెట్టు ప్రక్కనుండి వీరడు తిరిగి తలఎత్తుతూంటే వాడు నన్నెక్కడ చూస్తాడోఅని భయపడుతూ మాయింటివైపు పరిగెత్తాను.

వీరడు ఆరోజుల్లో పేరుపొందిన రౌడీ. ఒకప్పుడు వాడికి చిన్నబడ్డీ కొట్టు ఉండేది. అందుచేత వాడికి బడ్డీకొట్టు వీరడు అనే పేరు నిలిచిపోయింది. కోరమీసంతో, ఉంగరాల జుట్టుతో, కండలు తిరిగిన శరీరంతో అందంగానే ఉండేవాడు. కాని వాడికళ్ళు ఎర్రగా భయాన్ని కలిగిస్తూ ఉండేవి: కర్రసాము చేయటంలో వాడిది అందెవేసిన చెయ్యి. అమ్మవారి పండుగలలో, గౌరీ పున్నమి ఉత్సవాలలో వీరడి గరిడీ లేకుండ ఉండేదికాదు. ఆడపిల్లలకు వాడిని చూస్తే భయంగా ఉండేది. పదిమంది ఆడవాళ్ళు కలిస్తేనేగాని నీటికోసం చెరువు కెళ్ళేవారు కారు. నీలాటి రేవులో ఆడవాళ్ళు స్నానాలు చేస్తూంటే చింతచెట్టుక్రింద చుట్ట కాలుస్తూ చిలంవాలిచే చూపులతో ఆడవాళ్ళవైపు చూచేవాడు. వాడిచేతిలో ఎప్పుడూ కర్రఒకటి ఉండేది. ఒంటరిగా ఆడది కనిపిస్తే ఒదిలిపెట్టేవాడు కాదని; నేను మరీ చిన్నపిల్లవాడినై ఉన్నప్పుడు, ఒకనాటి మధ్యాహ్నం—పన్నెండు గంటలవేళ ఒక కన్నెపిల్లను దారుణంగా చెరచాడని, ఆమె ఆ అవమానాన్నిభరించలేక ఆ చెరువులోనే పడి ప్రాణత్యాగం చేసికుందని నేటికీ మావూళ్ళో చెప్పకుంటారు. అయితే వాడిని మనసులో తిట్టినా, పైకి అనటానికి ఎవరికీ సాహసం లేదు. డబ్బున్న వాళ్ళకు వాడి అవసరాలు చాలఉన్నాయి. ఆడవాళ్ళను తార్చటం, హత్యలు చేయటం వాడికి నిప్పుతోపెట్టిన విద్యలు, కల్లుతో తాగిన సరదాలు. వాడివల్ల మావూరికి ఉపకారం కలపోలేదు. వాడుంటే దొంగ అనేవాడు మాఊళ్ళోకి ప్రవేశించేవాడుకాదు. అలాంటి వీరడితో ఉన్న సీతను చూచిన తరువాత 'అయ్యో!' అనే భావం నాలో కలుగక పోలేదు. నాకు సపోటాలు కోసి యిచ్చిన సీతేనా ఈసీత, భర్తతో తీయగా మాటాడే సీతేనా ఈవిధంగా కనిపించినది అని అనిపించింది నాకు.

ఇంటివైపు పరుగెత్తిపోతున్న నాకు సీతప్ప బడ్డీదగ్గర పిల్లలకు జంతికలు కొనిపెడుతూ నీలయ్య కనిపించాడు. నీలయ్యను చూచిన తరువాత నీలయ్యకు జరుగుతున్న అన్యాయాన్ని దాచుకో బుద్ధి కాలేదు. నీలయ్యను రహస్యంగా పిలిచి 'నీలయ్యా!...మీసీత...వీరడు...మామిడి...' అని నేను చెప్పబోతూంటే జేవురించిన ముఖంతో పిల్లల తీసికుని చరచర వెళ్ళిపోయాడు నీలయ్య. ఆ తరువాత ఏమి జరిగిందో నాకు తెలియదు. మూడవరోజు ఉదయాన్నే 'వీరడు–సీతను లేవదీసికుని వెళ్ళిపోయాడని, అసలు అంతకుముందు ఆరునెల్లనుండీ వాళ్ళకు సంబంధముంద'ని మా పనిమనిషి మాయింట్లో చెప్తూంటే విన్నాను. ఆమాటల అర్థం స్కూల్లో మాకన్నా పెద్దవాడైన మురళీ తన ఈడు వాళ్ళతో చెప్తూంటేగాని తెలియలేదు. అయితే సీతను వీరడు లేవదీసికొని పోయినందుకు నాకేమీ విచారం వేయలేదు. ఊరికి వీరడిపీడ వదిలిపోయిందనిపించింది. కాని నీలయ్యను చూచినతరువాత గుండె చల్లబడి పోయింది. మౌనంగా తన పిల్లలతోపాటు నన్ను దగ్గరికి తీసుకుని తల నిమిరాడంతే. ఆనాడు తెలిసింది నీలయ్యమీద నేనెందుకు సానుభూతిని చూపుతున్నానో.

వారం రోజులవరకూ నీలయ్య ఎక్కడికీ పోలేదు. బొమ్మల చెక్కడం మానేసి ఎటో చూస్తూ కూర్చునేవాడు. వారం రోజుల తరువాత నీలయ్య ఊరువిడిచి వెళ్ళిపోయాడని చెప్పకున్నారు. ఆవిషయం తెలిసిన వెంటనే నీలయ్య ఇంటికి పరుగెత్తాను. ఇల్లు, పాక బావురుమంటూ కనిపించాయి. వేపచెట్టుక్రింద ఉయ్యాల బోసిపోతూ కనిపించింది. నాకళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇంటికి తిరిగివచ్చాను. ఒకప్పుడు నా పుట్టిన రోజుకని నీలయ్య నాకు కానుకగా యిచ్చిన బొమ్మ మాత్రం నీలయ్యకు బదులుగా నాదగ్గర ఉండిపోయింది; నాబాధను త్రవ్వుతూ.

అయితే నీలయ్యగురించి యింత కథను చెప్పే అవసరం ఏమిటో అని మీరంతా అంటే బహుశా నీలయ్యమీద ఏర్పడిన సానుభూతే కారణమేమో. ఈమధ్య నాలుగు సంవత్సరముల క్రితం నీలయ్య నాకు కనపడకపోతే నేనీకథను మీకు చెప్పేవాడినే కాదు.

సింహాచలంనుండి పాడేరుకు ఇంజనీరింగ్ సూపర్వైజర్‌గా వెళ్ళిన మొదటిరోజునే బస్సుదగ్గర కలిశాడు నీలయ్య. సుమారు పదమూడు సంవత్సరాల తరువాత కలిశామన్నమాట. నన్ను గుర్తుపట్టి ఆనందంతో పరుగెత్తుకుంటూ వచ్చాడు నీలయ్య. నేను సుమారు అదేస్థితిలో ముందు కురికాను. నీలయ్య అడక్కముందే నా బదలీ గురించి చెప్పాను. అప్పటికి రాత్రి ఎనిమిది గంటలయింది. 'రా బా బూ! ఈ-రాత్రి మా యింటనేఉండి ఉదయాన్నే అందర్నీ కలియవచ్చు' అన్నాడు: పాడేరు ఘాటీ పెద్ద ప్రయాణంతో పేగులు కదలిపోయినట్టుంటే చలిలో నీలయ్యవెంట వెళ్ళాను నీలయ్య యింటికి. ఊరుచివర ఉంది నీలయ్య యిల్లు. ఇంటి వెనుక తోట ఏదో ఉందని చెప్పాడు నీలయ్య. అక్కడనుండి మాబస్సు వచ్చినదారి కొండలు లీలగా కనిపించసాగాయి. ఇళ్ళలో దీపాలు మినుకు మినుకు మంటూంటే, ట్రాన్సిస్టర్‌రేడియో లోంచి శివరంజిని రాగంతో పాట వినవస్తూంటే ఆక్కడికి కొద్దిదూరంలోనున్న దేవాలయంలోనుండి గంటలు వినిపిస్తూంటే నేనొక కొత్తప్రదేశంలో ఉన్నానన్నది జ్ఞాపకానికి వచ్చింది. ఎనిమిగిగంటలకే ఊరు జన సంచారం లేనిదైంది. కప్పల అరుపులతో, కీచురాళ్ళ ధ్వనులతో వాతావరణం నిండిపోయింది. నీలయ్యది పూరిల్లే అయినా, అందంగా, పరిశుభ్రంగా ఉంది లోపల. ఇంటిలో ముందుగదిలో ఒక టేబులు, కుర్చీ, మంచమొకటి ఉన్నాయి. టేబిలు ముందు హరికన్‌లాంతరు వెలుగుతోంది. ఆ బల్లముందు ఒక కుర్రవాడు పుస్తకాలు ముందేసికుని చదువుకుంటున్నాడు. గోడ వానుకుని కూర్చుని పదహారేళ్ళ అమ్మాయి అల్లిక పుల్లలతో ఏదో అల్లుతోంది. నేను

ఇంటిలోకి రావటం చూచి ఆ అమ్మాయి మెమ్మదిగా ఇంటిలోపలికి వెళ్ళిపోయింది. 'అది నా కూతురు బాబూ! అహల్య. వాడు నా కొడుకు చంద్రం. మరచిపోయారేమో!'

పుష్పతాజా తనంతో, పువ్వు పొరలంతో
కాశ్మీర్ బోకే మిమ్మలను ముగ్ధులను
చేసే మనోహరమైన కుసుమ పరి
మళాలు. నేడే ఈ అద్భుతమైన
అవకాశాన్ని వినియోగించుకోటానికి
త్వరపడండి. సరుకు పరిమితం.

నీలకంఠం

అన్నాడు వాళ్ళను నాకు పరిచయం చేస్తూ. ఆ కుర్రవాడు నన్ను కొత్తవానిని చూచి నట్టు చూశాడు అహల్య వంటింటి కిటికీ లోంచి చూడటం నే గమనించాను. దీపపు వెలుగులో మెరిసే ఆ కళ్ళను చూడగానే నాకు సీత జ్ఞాపకమొచ్చింది. ఆ కళ్లే అంత అందంగా ఉంటే అహల్య చాల అందంగా ఉంటుందని అంచనా వేశాను. సుమారు ఒక అరగంట తన కొడుకు చదువు గురించి, తన వ్యాపారం గురించి చెప్పాడు. సీత గురించి నీలయ్యేమీ అడుగ లేదు. నేనేమీ చెప్పలేదు.

'నాన్నగారూ! రమ్మనండీ నీళ్ళు కాగి పోయాయి' అంది అహల్య. మొదట అది అహల్యగొంతు అనుకోలేదు. ఏదో అద్భుత మైన సంగీత పరికరమా పలికినది అని పించింది. చలి బాగ ఉండటంచేత నేను వేడినీటి స్నానానికి అభ్యంతరం చెప్పలేదు. నేను స్నానంచేసి వచ్చేసరికి భోజనం వడ్డించి సిద్ధం చేసింది అహల్య. అహల్య చేతిమీద నెయ్యి వేస్తుంటే 'ఈ చేతు లతో పిల్లలకు అన్నంముద్దలు తినిపించాను. ఇప్పుడు ఇదే వండిపెడుతున్నది. ఏమిటో చిన్నతనంలోనే దీనికీ బాధ్యత. ఇక ఎంత కాలంలే బాబూ! దీనిని ఒక అయ్యచేతిలో పెడితే నా బాధ్యత తీరుతుంది. చంద్రం నా ముసలితనంలో గొంతులో నీళ్ళు పొయ్యక పోడు' అని అన్నాడు నీలయ్య.

'నీకేం! నీలయ్యా? నీవు చాల అదృష్ట వంతుడవు. నీ పిల్లలు వజ్రాలు. మీ అమ్మాయికి చక్కని మొగుడు వస్తాడు. నీకు గుణవతి అయిన కోడలు వస్తుంది. అప్పుడేమిటో అలా జరిగిపోయింది. విధి వైపరీత్యం. అంతే!' అని అన్నాను. నా మాటలకు అహల్య సిగ్గుపడుతూ గోడ కానుకుని నిల్చుండిపోయింది. అహల్యను క్రీగంటే చూడగలిగినప్పటికీ అహల్యను చూస్తుంటే అజంతా శిల్పమే జ్ఞాపకము వచ్చింది. హరికన్‌లాంతరు వెలుగులో మెత్తని బంగారంలా మెరిసిపోసాగింది అహల్య. అహల్య అందంముందు, నా జ్ఞాప కాలలో లీలగా మిగిలిన సీత తీసికట్టే ననిపించింది. నీలయ్యకున్నట్టే పలుచని పెదిమలు, అందమైన కనుబొమ్మలు ఉన్న అహల్య నన్ను ఆకర్షించిన మాటమాత్రం వాస్తవం.

భోజనమయిన తరువాత రాత్రి నిద్ర పోయే సమయానికి నా ప్రక్కనవచ్చి కూర్చు న్నాడు నీలయ్య. దీపాన్ని తగ్గించి చాల రహస్యంగా అడిగాడు. 'సీత ఎప్పుడైనా అక్కడికి వచ్చిందా బాబూ!' అని వణికే గొంతుకతో. నీలయ్య ప్రశ్నకు సమాధానం నాకు తెలుసు. కాని ఆ సమాధానాన్ని విని నీలయ్య తన్ను నిగ్రహించుకోగలడా? బాధను భరించగలడా అనేదే నా సంశయం. నీలయ్య మా వూరిలో తలయెత్తుకుని తిరగలేక వూరిని విడిచిపెట్టిన ఆరునెల లకే మా వూరొచ్చింది సీత. అంతకు ముందే వీరడు మా ఊరు రావటం, ఊరంతా వాడిని 'సీత ఏదిరా?' అని అడగటం, సీత తనకు తెలియదని, సీతకు తనకు సంబంధంలేదని వాడు దబాయించటం జరిగాయి. సీత వస్తూనే నీలయ్య పాకకు వచ్చింది. నీలయ్య లేడని తెలిసికుని లబో దిబోమని ఏడిచింది. ఎవరు ఏమి చెప్పినా ఏడుపును మానిందికాదు. 'ఇంటి చుట్టూ రోజంతా తిరిగింది. సీత పరిస్థితి చూచి హృదయము ద్రవించిన పెద్దలు సీతను ఏలుకొమ్మని వీరడికి చెప్పారు. సీత ఎవరో తనకు తెలియదని వీరడు బుకాయించటం ఊరంతటికీ చిచ్చుపెట్టింది. భోజనం చేయక రోజంతా అక్కడే తిరిగి అప్పటికే నెలలు నిండిన సీత, పశ్చాత్తాపంతో నీలయ్యయింటి వెనకనున్న నూతిలోపడి మరణించటం, అలా ఆత్మహత్య చేసికున్న సీత నీలయ్య యింటిముందున్న చింత చెట్టుమీద దయ్యమై ఉన్నదని మేమంతా భయపడి, ఆ ప్రక్కకు వెళ్ళటం మాను కోవటం జరిగాయి. ఇప్పటికీ పల్లకీలో ఊరేగుతున్న సీత, నూతిదగ్గర ప్రాణం పోయి పడిఉన్న సీత నా కళ్ళకు కదుతూనే ఉంటారు. సీత అంత దారుణంగా మర ణించిన విషయాన్ని విని నీలయ్య భరించ గలడా అని అనుమానిస్తూ 'నేనున్నంత కాలం సీత రాలేదు నీలయ్యా!' అని అబద్ధమాడాను. ఇక్కడొక చిన్న విషయం చెప్పాలి. నీలయ్య దగ్గర, సీత దగ్గర చనువు ఉండటంచేత చిన్నతనం నుండి అలవాటు అయి ఉండటం చేత సీతను 'సీత' అనే పిలవటం అలవా

తయింది:

'ఆ దుర్మార్గుడు' పళ్ళు కొరుకుతూ అన్నాడు నీలయ్య. 'సీతను ఏనాడూ సుఖపెట్టి ఉండడు. సీతను ఏనాడో వదిలిపెట్టి ఉంటాడు. సీత అమాయకురాలు. దానికేం తెలియదు. ఏమైందో ఏమిటో! నా సీత ఏమైందో ఏమిటో' అంటూ ఏడుస్తూ చేతుల్లో తలను దాచుకున్నాడు.

నీలయ్యను ఎలా సముదాయించటమో నాకు తెలియలేదు. మర్నాడు ఉద్యోగంలో చేరాను. నీలయ్యే మంచి యిల్లు చూచిపెట్టాడు. నా వదినని చూచి నాకు అన్ని విధాల సహాయం చేయ ముందుకొచ్చింది ఊరు. నిముషాల మీద పరపతి ఏర్పడింది. తీరికవేళలలో నీలయ్య యింటికి వెళ్ళేవాడిని. బొమ్మలు చెక్కుతునో, కర్రపని చేస్తునో కబుర్లు చెప్పేవాడు నీలయ్య. కర్ర బాగా దొరకటం చేత, పనితనం ఉన్న నీలయ్య, బాగానే డబ్బు నార్జించసాగాడు. అహల్యకు సుమారు పది పన్నెండు తులాల నగలు చేయించాడు. పిల్లలకు మంచి బట్టలు కొన్నాడు. ఇల్లు కొన్నాడు. నీలయ్య చేతి క్రింద ఒకపని కుర్రవాడు కూడ ఉన్నాడు. నీలయ్య చాల హాయిగానే ఉన్నట్టు అందరికీ లనిపిస్తుంది. కాని నన్ను చూడగానే (బహుశా సీత జ్ఞాపకం వస్తుందేమో) కంఠంలో హాలాహలం ఉన్నట్టు బాధపడుతూ కనిపించేవాడు. నన్ను చూస్తే నీలయ్యకు పాత విషయాలు జ్ఞాపకానికి వచ్చి బాధ పెడతాయని తెలిసి, అహల్యను చూడాలని ఉన్నా యింటికి వెళ్ళేవాడిని కాదు.

తీరిక ఉన్నప్పుడు స్కెచ్ బుక్కు, పెన్సిలు పట్టుకుని కొండలవైపు వెళ్ళిపోయేవాడిని. కేంపుకెళ్ళినా ఆ పుస్తకం నా దగ్గరుండేది. కొండ ప్రాంతపు స్త్రీలనే నమూనాగా ఉంచుకుని నా బొమ్మలకు లావణ్యం నేర్పాను. గీతల బలంగా నిర్దుష్టంగా, స్పష్టంగా గీయటం తెలిసొచ్చింది నాకు. బొమ్మలు చేతులు కాళ్ళు కట్టి పడేసినట్టు కాక చాల లలితంగా, మనా యూపంగా కదలటం ప్రారంభించాయి. వ్యర్థమైన గీతల తుడిచి పారేసిందక్కడే. రమణీయమైన ప్రకృతిని రంగురంగులలో తీర్చి దిద్దగలిగాను. కొండస్త్రీలు, పురుషులు నా కాగితాలపై నిలిచారు. కాని ఒక ఘాటి సంఘటన మాత్రం నన్ను నాడు కలచి వేసింది.

ఒకనాటి _ మధ్యాహ్నం ఒక పల్లె నుండి వస్తున్నాను సైకిలుపై. కొండ రాళ్ళ మధ్య నిలచిన చల్లని నీటి మడుగులో చేరి నిర్భయంగా స్వేచ్ఛగా, స్నానం చేస్తోందా ఏకాంత సమయంలో ఒక స్త్రీ. ఆ ఎండవేళ చల్లని నీటిలో స్నానం చేయటం వలన కలిగిన హాయి ఆమె ముఖంలో ప్రస్ఫుటం కాజొచ్చింది. తడసిన శిరోజాలను వీపుపైన, నగ్నంగా ఉన్న రొమ్ముపైన వదలి వేలికమ్మల మధ్య చిక్కుడి పోయిన శిరోజాల సరి చేసికునే తీరులో ఆమె నిలబడిన భంగిమ అద్భుతంగా, అనిర్వచనీయంగా విలసిల్లింది. ఆ భంగిమ ఇంతవరకూ ఏ చిత్రకారుడూ ఊహించ లేదు. నిర్వచించలేదు. నాకు లభించిన అవకాశాన్ని విడువదలచుకోలేదు. సైకిలు దిగి స్కెచ్ బుక్కు పైనే చూచిన దృశ్యాన్ని గబగబా రచించి సైకిలెక్కాను. ఊళ్ళో ప్రవేశించిన నాకు అహల్య ఇంటి ముందు నిల్చుని కనిపించింది. అహల్యను చూచి సైకిలు దిగి ఇంటిలోకి వెళ్ళాను. నీలయ్య అనకాపల్లి వెళ్ళాడని అతని కోసమే తానెదురు చూస్తున్నదని చెప్పింది. అహల్య కళ్ళనే తనివితీర చూడాలనిపిస్తూంటే అహల్యను వదలి రాబుద్ధి కాలేదు. ఆ రోజు రాత్రి జలకమాడుతున్న స్త్రీ మూర్తిని తీర్చి దిద్దబోగా ఆ చిత్రం పూర్తిగా అహల్య రూపాన్నే సంతరించుకోవటం చూచి, నాలో అహల్య ఎంత గాఢంగా నిలచినదీ తెలిసి పరితాపం చెందాను. ఆ చిత్రంలో అహల్య ఒక నమూనాగా నిలువలేదు. నా మనసుకు ప్రతిగా నిలిచింది. బొమ్మపై గీతలు దిద్దుతూంటే అహల్యను ముట్టుకున్నంతగా బాధ పడ్డాను. అహల్యను మనసార కోరుతున్న విషయం నాకు స్పష్టపడింది. నేను అహల్యను ప్రేమించాను. ఆ విషయం నాకు తెలుసు. అంతకన్నా కఠినమైన సత్యము యింకోటి తెలుసు. అహల్య గగనకుసుమం. అహల్యను కోరటం అనుచితం. కులం కాని కులంతో వివాహానికి నీలయ్య యిష్టపడడు. సీత పాలిట వీరడు దాపురించి నీలయ్యను అన్యాయం చేసినట్టే, అహల్య పాలిట నే దాపురించి నీలయ్యను అన్యాయం చేయదలచ లేదు. నీలయ్య ఆశలను వమ్ము చేయదలచ లేదు. అహల్యను చూడాలని నా మనసు పదే పదే కోరుతున్నా, రెండు రోజులు కనిపించకపోతే నీలయ్యతో పాటు అహల్య— 'ఎందుకు చాలా కాలంనుండి నల్లపూసలా కంటికగుపించటం లేద'ని నిలవదీస్తుందని నాకు తెలిసినా, రోజు కొకసారైనా కనిపించమని అహల్య చేసిన హెచ్చరికలు చెవిలో గింగురు మంటున్నా అహల్యకు సాధ్యమైనంత దూరంగా వుండసాగాను. ఆమెను మరచిపోవాలని ప్రయత్నం. అహల్యకు పెళ్ళయితే ఆమె గురించి అంతగా ఆలోచించననే నమ్మకం ఏర్పడింది. నీలయ్యకు అహల్యకైన వరాన్వేషణలో నేనూ చేయూత నిచ్చాను.

ఇటీవల నటనాలయ నాటక కళా పరిషత్తు (ఖర్గపూర్) నిర్వహించిన నాటక పోటీలలో ఉత్తమనటిగా ఎన్నికైన కుమారి కె. సుజాత ('నాటకం'లో ఊర్వశి పాత్రధారిణి)

నా ప్రయత్నం ఫలించింది. విశాఖపట్నంలో మంచి సంబంధం తటస్థపడింది. ఆ కుర్రవానికి ఒక కిళ్ళీ దుకాణం వుండటం, అతను బాగా డబ్బు నార్జించి వుండటం, ఆర్జించినది జాగ్రత్తగా దాచి మంచి ప్రయోజనాల కుపయోగించటం చూచిన తరువాత నీలయ్య ఆ సంబంధానికి అంగీకారాన్ని తెలిపాడు. పెళ్ళి వైభవంగా జరిపించాడు నీలయ్య. అహల్యను ఆమె భర్త ప్రక్కన చూచిన తరువాత అహల్య చాల అదృష్టవంతురా లనిపించింది. పిల్లలను విడిచి వుండలేని నీలయ్య యిల్లు, వాకిలి అమ్మేసి విశాఖపట్నానికి మకాం మార్చాడు. అక్కడే చిన్న షాపు పెట్టి ఫర్నిచర్ చేసి అమ్మసాగాడు. ఆ మరుసటి సంవత్సరమే [illegible] నుండి సంబంధం తెచ్చి చంద్రా

వికి వెళ్ళి చేశాడు నీలయ్య. నేను పాడేరు నుండి విశాఖపట్నం వెళ్ళినప్పుడల్లా నీలయ్యను కలిసేవాడిని. చంద్రం తండ్రికి చేదోడువాదోడుగా వుండి వ్యాపారాన్ని అభివృద్ధి చేస్తూంటే, అహల్య భర్తతో ఆనందంగా కాపురం చేసుకుంటూంటే నీలకంఠం ముఖంలో ఆనందాన్ని చూశాను. సీతకు దూరమైనాడన్న బాధ లతనిలో మరుగు పడిందని నేననుకొనేవాడిని. ఒకటి రెండు సార్లు అహల్య ఇంటికి తీసికెళ్ళాడు నన్ను. అల్లుడు కూతురు అన్యోన్యంగా వుండటం గురించి చాలా చెప్పేడు నీలయ్య. నీలయ్య ముఖంలో ఆనందాన్ని చూచిన తరువాత నాకేదో నిధి దొరికినట్లయింది. కాని మరో ఆరు నెలలకే పరిస్థితి తారుమారవటం చూచి దిగ్భ్రాంతి చెందాను. అహల్య భర్త ప్రమాదవశాత్తు లారీ క్రింద పడి మరణించటం, అహల్య నీలయ్య యింటికి చేరటం చూచి నీలయ్యపట్ల దేవుడు ఎంత క్రూరుడైనాడో అనిపించింది. నీలయ్య మానసిక వేదనను, అహల్య కన్నీటిని చూస్తూ నా తరం కాలేదు.

ఇంటికి తిరిగివచ్చిన నన్ను నా బొమ్మలు వెక్కిరించాయి. అహల్య రూపాన్నే దిద్ది కొన్న బొమ్మలు నా బాధను మరింత త్రవ్విపోశాయి. కుంచెలను, రంగులను పెట్టె అడుగున పడేశాను. ఏ మాత్రం తీరిక దొరికినా అహల్యకు జరిగిన అన్యాయమే గుర్తుకొచ్చేది. ఒకరోజు నీలయ్య యింటికి వెళ్ళాను. నీలయ్య యింట్లో లేడు. అహల్య విషాదాన్ని మరచిపోయిన దానిలా నవ్వ ప్రయత్నిస్తూ నన్నాహ్వానించింది. చంద్రం, చంద్రం భార్య ఇంట్లో లేకపోవటం చేత అహల్యతో ఏకాంతంగా మాట్లాడ వీలు కలిగింది.

'నీ పరిస్థితికి కారకుణ్ణి నేనే' అన్నాను సంభాషణను ప్రారంభిస్తూ.

'ఈ సంబంధాన్ని కుదిర్చింది నేను.'

'అలా అనకండి. చాల తప్పు. మీరు నేను సుఖపడతాననే చేశారు. నా నుదుటి గీతకు మీరెలా బాధ్యులవుతారు?' అంది అహల్య వైరాగ్యం ధ్వనించే కంఠంతో. ఆ మాటలు వింటూంటే రెండు రెట్లు వయసు పొందిన దానిలా కనిపించింది అహల్య.

'నిజం అహల్యా! నీ పరిస్థితికి నేనే కారకుడను. నీరడివల్ల మీ అమ్మ మోసపోయింది. అది మీ నాన్నకు ఈ నాటి వరకూ మాన్పలేని గాయమై ఉండిపోయింది. నీ అందం నన్ను ముగ్ధుడ్ని చేసింది. కాని నిన్ను పెళ్ళి చేసికోవటం నీలయ్యకు అసంతృప్తిని, ఆశాభంగం కలిగిస్తుందని నాకు తెలుసు. నీకు పెళ్ళయిపోయి నీవు దూరంగా వెళ్ళిపోతే నా మనసుకు స్వస్థత చిక్కుతుందని నీ పెళ్ళి గురించి ... నేను ... నేను తొందరపడ్డాను అహల్యా! నేనే తొందరపడ్డాను' చెపుతూ ఆగాను. అహల్యను చూచాను.

నావైపు క్రొత్త వ్యక్తిని చూచినట్లు వింతగా చూచి తలదించుకుంది అహల్య.

'ఇప్పుడు చెప్పు! నీ పరిస్థితికి కారకులెవరు? నీ నుదిటి కుంకుమ చెరిగిపోవటానికి కారకులు......'

'మీరు మాత్రం కాదు. విధి. అంతే! అలా జరగాలని ఉంది. జరిగిందంతే!' అని ఊరుకుంది అహల్య.

'ఈ వయసులో నీవే యిలాగ ఉండటం నాకు బాధగా ఉంది. నీవు అంగీకరిస్తే సంబంధాలు చూదాం! నీవు మళ్ళీ......'

'బాబూ!' అరచింది అహల్య. ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి.

'బాబూ! అలాటి సలహాల నీయకండి. జీవితంలో ఎవరికైనా ఒకటే మనువు' అంది అహల్య చేతిలో ముఖం దాచుకుని.

నేనేమీ మాటాడలేక పోయాను. కొద్ది సేపు మౌనంగా ఉండి లేచి వచ్చేశాను.

తరువాత ఆరు నెలలకే అనకాపల్లికి ప్రమోషన్‌మీద వెడుతూ నీలయ్యను చూడ వెళ్ళాను. నీలయ్య దుకాణం మూసి వుంది. అప్పటికి మూడు నెలలనుండి నీలయ్య కొట్టుకు రావడం లేదని తెలిసి నీలయ్య యింటికి వెళ్ళాను నన్ను చూచి నీలయ్య బావురుమన్నాడు. పరిస్థితి తెలియని నాకు అహల్యే కన్నీరు పెట్టుకుని చెప్పింది:

'నావల్లనే అందరికీ కష్టాలు వచ్చాయి బాబూ! నే నిక్కడ వుండటం మా మరదలికి యిష్టపడటం లేదు. తమ్ముడిని తీసుకుని వెళ్ళిపోయింది. చంద్రం ఇక్కడ లేడు. ఏ విధంగానైనా తమ్ముడికి నచ్చచెప్పి తీసుకొని రా బాబూ! కావాలంటే నేనే ఎక్కడికైనా వెళ్ళిపోతాను' అంది అహల్య.

'నీ వెందుకు వెళ్ళటం? చంద్రాన్నే తెచ్చే ప్రయత్నం చేదాం' అన్నాను.

'కాదు బాబూ! కాదు! ఇది నేనుండవలసిన చోటు కాదు. ఇది వాడి యిల్లు. తమ్ముడిని తెచ్చే ఉపకారం చేసి పెట్టు బాబూ! నాన్న బాధతో కృంగిపోతున్నారు. మమ్మల్ని విడిచి ఎప్పుడూ వుండలేదు నాన్న' అంది అహల్య.

చంద్రాన్ని తెచ్చి వప్పగిస్తానని మాట యిచ్చి అనకాపల్లి చేరాను. అవకాశాన్ని చూచుకొని రెండు రోజులు సెలవు పెట్టి చంద్రం దగ్గరకెళ్ళి అతన్ని సమాధానపరచి కొన్ని విధులను బోధపరచి, చంద్రాన్ని తీసుకొచ్చి నీలయ్యకు అప్పగించాను. వచ్చే ముందు నీలయ్య అన్నాడు 'బాబూ! ఒక ఉత్తరం రాసిపెట్టవూ! సీత ఎక్కడుందో వ్రాసి తెలుసుకో బాబూ! సీతను చూడాలని వుంది. మన వూరిలో ఎవరికైనా వ్రాయి బాబూ సీతగాని నే లేనప్పుడు వచ్చిందేమోనని, ఎక్కడుందో కనుక్కో బాబూ! ఈ ఉపకారం చేసిపెట్టు బాబూ! ఆ అమాయకురాలు ఎన్ని బాధలు పడుతోందో! ఉత్తరం రాసిపెట్టవూ!' అని.

నీలయ్యకు ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు.

ఉత్తరం వ్రాస్తానని మాట యిచ్చేసి వచ్చేశాను.

అది జరిగిన నెల రోజులకు ఒక ఉదయం నీలయ్య అనకాపల్లి వచ్చి కలిశాడు.

కొడుకుచేత నిరాదరింపబడిన నీలయ్య చెప్పింది విని నిర్విణ్ణుడనైపోయాను.

అహల్య వెళ్ళిపోయింది.

సీతలాగ వెళ్ళిపోలేదు.

ఒకవైధవ్యాన్నిచూపిస్తూ వెళ్ళిపోయింది.

చంద్రం భార్య తమ్ము వదుల్చుకోడానికి మోపిన నిందను స్త్రీగా భరించలేక వెళ్ళిపోయింది.

నీలయ్య కంఠంలో మరింత హాలాహలం ఉంచుతూ వెళ్ళిపోయింది అహల్య.

తాను వెళ్తున్నది తల్లిని కలియటానికి అన్నది అహల్యకు తెలియకపోవచ్చు.

నీలయ్య తరువాత ఎక్కడికెళ్ళాడో నాకు తెలియదు.

బహుశా సీతకోసం వెతుకుతున్నాడేమో.

నీలయ్య మాత్రం నీలకంఠమే. ●